# ఆనాటి నుంచీ ఈనాటి వరకూ చెన్నయ్ వీడని చెలువంపు సౌజన్యుడు - సి.నాగేంద్రప్రసాద్

**ఆయుస్సత్వ బలారోగ్య సుఖప్రీతి వివర్ధనా**
**రస్యా స్నిగ్ధ స్థిరా హృద్యా - ఆహారా సాత్విక ప్రియాః**

ఆయువును, జ్ఞానాన్ని, బలాన్ని, ఆరోగ్యాన్నీ, సుఖాన్ని, ప్రీతివృద్ధిని కాంక్షించే వారు సాత్త్విక ప్రియులు అన్నాడు భగవానుడు. అలాంటి వారున్నారా అంటే ఉన్నారనడానికి సి.నాగేంద్రప్రసాద్‌నే సోదాహరణంగా చెప్పవచ్చు. ఆయన ప్రస్తుతం చెన్నయ్‌లోని ఆంధ్రా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు. ఏ వర్గానికీ చెందని ఆయన కలుపుగోలు వర్గానికి మాత్రం చెందుతారు – వ్యక్తిత్వాన్ని బలిపెట్టరు. సేవాభావం అధికం.



ఆనాటి ఆంధ్ర బాలానంద సంఘం నుంచీ ఆయన కనుసన్నల్లో ఉన్నవాణ్ణి. తెలుగు మహాజన సమాజం, ప్రపంచ తెలుగు సమాఖ్య, వేణుగోపాల్ విద్యాలయం ఎన్నిటికో ఆయన సేవలందించారు.


పర్యాటక రంగానికి నాగేంద్రప్రసాద్ చేసిన సేవలను విదేశీ పర్యటక సంస్థలు గుర్తించాయ్, అవార్డులతో గౌరవించాయ్. నేను పలుమారులు అమెరికా పర్యటనలూ, అండమాన్ నికోబార్ దీవులు సునాయాసంగా పర్యటించడానికి నాగేంద్రప్రసాద్ గారి ట్రావెల్ ఎక్స్‌ప్రెస్ సంస్థయే సులభతుల్యమైంది. ప్రసాద్ గారు తండ్రి శజయంత్యుత్సవాన్ని హైదరాబాద్ ఐ.ఏ.ఎస్. ఆఫీసర్సు క్లబ్‌లో వైభవంగా జరిపారు. ఆయన జనకులు సి.నరసింహం చెన్నయ్ కార్పొరేషన్ కమీషనర్‌గా పనిచేసిన ఐ.ఏ.ఎస్. ఆఫీసర్. నాగేంద్రప్రసాద్‌లో నిరాడంబరత్వం అధికం. ఏ సభకు పిలిచినా యెక్కడో ఒక మూల కూర్చుంటారు. ఆధిక్యతను ప్రవర్తించరు. ఈ నిరాడంబర, నిరవధిక సేవామూర్తికి మా శుభాశీస్సులు.

# సత్తిరాజు శంకరనారాయణ (చెయ్ తిరిగిన రేఖా చిత్రకుడు)

(గత సంచిక వివరించని వివరాలు)

రేఖావిశిష్టత గల శంకరనారాయణ గార్ని ఇంతవరకూ నేను ముఖతః చూడలేదు. ఆయనలోని యే అంతర్వాణి ప్రేరేపించిందో ఒకానొక శుభదినాన నా రేఖా చిత్రాలని గీచి కొరియర్‌లో పంపారు. వారికి నాపై కలిగిన హృదయస్పందనను నా కలం వ్యక్తీకరించలేకపోతున్నది.

వారు పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో జన్మించారని తెలియగానే నా ఆనందానికి అవధులు లేకపోయాయి. అది వశిష్ట గోదావరీ తీరం. సాగరంలో సంగమించడానికి రెండు క్రోసుల దూరంలోనే ఉన్నది. ఆ గోదావరి నీళ్లు ఎంత ఉప్పగా ఉంటాయో, అక్కడ పుట్టిన మనుష్యుల మనసులు అంతటి తీయగా ఉంటాయ్ – అనడానికి ప్రబలసాక్షి శంకరనారాయణ. ఆ శంకర నారాయణ పేరుకు తగ్గట్టుగానే – నర్సాపురంలోని లాంచీల రేవుకు వెళ్ళే వీధిలో శైవ, వైష్ణవాలున్నాయ్. అనేక హరికథల్ను రచించి, పురాణ కథా శ్రవణం చేయించిన శ్రీమాన్ దీక్షితులుగారు ఆ నరసాపురంలోనే పుట్టారు! సుప్రసిద్ధ న్యాయవాదులు, విద్యా సంస్థల స్థాపకులైన ఎర్రమిల్లి నారాయణమూర్తిగారు నరసాపురమునకో విశిష్టతను తెచ్చారు. ఎన్నో విశిష్టతల్ను పల్లవింపచేసుకున్న నరసాపురం తన విస్తృతను పెంచుకోలేదు. కానీ అక్కడ పుట్టినవారూ, పెరిగినవారూ విశిష్టమూర్తులయ్యారు. అది ఆ వశిష్ట గోదావరీ తీర విశిష్టత.



1936 సం॥ములో నర్సాపురంలో పుట్టిన శంకరనారాయణగారి ఉన్నత విద్యాభ్యాసం మద్రాసులోని కేసరీ ఉన్నతపాఠశాలలోనూ, లయోలా కళాశాలలోనూ జరిగింది. మద్రాసులోని ఆకాశవాణి కేంద్రంలో 1963 సం॥ములో ఉద్యోగం ప్రారంభించి 1995 సం॥ములో స్టేషన్ డైరెక్టర్‌గా పదవీ విరమణం చేసారు. కానీ (రేఖాచిత్రకునిగా) రమణీయుడయ్యారు. దాదాపు రెండు వేల చిత్రాలు ఆయన పెన్సిలు, ఇండియన్ ఇంకు ద్వారా గీసి ఉంటారని ఆయన వ్యక్తి గత చరిత్ర చెబుతున్నా– ఇంకా యెక్కువగా గీచి ఉంటారనే నా ఊహ చెబుతున్నది. దేశంలోని అనేక రంగాల ప్రముఖుల రేఖా చిత్రాలను శ్రీ శంకరనారాయణ చిత్రించారు. ఆధ్యాత్మిక గురువులు, సారస్వత ప్రియులు. లలిత, శాస్త్ర సంగీత విద్వాంసులు రాజకీయ నాయకులు, సినిమావారు పారిశ్రామికవేత్తలు– వారు వీరననేల ఎన్నో రంగాల ప్రముఖులు వీరి రేఖా చిత్రములందు సంధింపబడిన వారే!

వీరు పొందుపరచని మహనీయులు ఉండరంటే అతిశయోక్తి కాదు. అనేక నగరాల్లోని అనేక సంస్థలు వీరి రేఖా చిత్రాల ప్రదర్శనం చేసారు. వీరందుకోని సత్కారములు లేవు. ఇలాటి నిరాడంబర హృదయుణ్ణి, అవిశ్రాంత కృషీ వలుణ్ణి, ఎందరెందరి డెందముల్లో ఆనందం కూర్చినవాణ్ణీ, ప్రతిఫలం ఆశించని రేఖాచిత్రకారుణ్ణీ పరిచయం చేయ దంతో 'ప్రముఖాంధ్ర' హృదయం ఎంతో పరవశం చెందింది. ఎనిమిది పదుల వయసులోకి ప్రవేశించనున్న శంకర నారాయణను మరో నాలుగుపదుల నిండు ఆరోగ్య సౌభాగ్యములతో వర్ధిల్లాలని 'ప్రముఖాంధ్ర' ఆశీర్వదిస్తున్నది. శుభమ్ భూయాత్! (మరిన్ని వివరాలు కావాలనుకునేవారు Website: www.sankarportraits.com చూడండి. 044-24424256 నెంబర్నుగానీ, 09840372415 మొబైల్నుగానీ సంప్రదించండి)

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

## ఈ ఐదుగురు హాస్యనటులూ ఏకకాలంలో ఉన్నప్పటికినీ ఎవరి బాణీ వారిదే!

రేలంగి, రమణారెడ్డి, అల్లురామలింగయ్య, రాజ్‌బాబు, పద్మనాభం ఐదుగురూ ఐదు తరహాల హాస్యాన్ని పండించారు. ఎవరికెవరూ పోటీ కాలేదు. రమణారెడ్డి చిత్రనిర్మాణ సారథి కాలేదు. మిగతా నలుగురూ చిత్ర నిర్మాణం చేశారు. రేలంగి అద్దాల నారాయణరావు కోసం చిత్ర నిర్మాణంలో పాలుపంచుకున్నారు. కానీ పెట్టిన పెట్టుబడి రాలేదు. రాజ్‌బాబుకు చలనచిత్ర నిర్మాణం కలిసి రాలేదు. కానీ చిన్న చిన్న హాస్య నటుల భవితకు ఎంతగానో తోడ్పడ్డారు. అల్లురామలింగయ్య కుమారుడు అల్లు అరవిందు చిత్రనిర్మాతగా, నిర్మాతలకు ఆర్థిక పరిపుష్ఠిప్రదాతగా పేరు తెచ్చుకోవడమే గాకుండా, ఈనాటికినీ తెలుగు చిత్రరంగంలో ప్రముఖునిగా తన స్థాయిని పెంచుకుంటున్నాడు. బావమరిది చిరంజీవి ఎదుగుదలలో అల్లు అరవింద్ పాత్ర ఎంతో ఉంది. హాస్యనటనా చతురిత ఉన్నప్పటికినీ, నటనవైపుగా తన దృష్టిని సారించలేదు.

పద్మనాభం గురించి చెప్పుకోవాలంటే రేఖా అండు మురళీ సంస్థ ద్వారా అనేక మంచి చిత్రాలను నిర్మించడమే గాకుండా దర్శకత్వంలో నిపుణతను చూపిన ప్రజ్ఞావంతుడు. తెలుగులో తనదైన శైలిలో మొల్ల రామాయణం రచించిన కవయిత్రి మొల్ల చరితాన్ని చిత్రంగా మలచిని ఘనుడు. కానీ తన వారసులెవర్నీ సినిమా పరిశ్రమనందు నిలపలేకపోయారు.



# సూర్యకాంతం స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలే(రు)దు!

# సూర్యకాంతం హాస్య నటియా, గయ్యాళి నటియా చెప్పలేం!



సూర్యకాంతం

**1961**వ సంవత్సరం 'గుండమ్మ' కథాచర్చలు చర్చిస్తున్న డి.వి. నరసరాజు, చక్రపాణి మదిలో సూర్యకాంతమే ఉన్నారు.

సినిమాల్లో సాధారణ సంప్రదాయం ఏమిటంటే, ముఖ్యపాత్రను ముందుగా పరిచయం చేసే సందర్భంలో ఓ చిన్నసీన్ ప్రవేశపెడతారు. 'గుండమ్మకథ'లోనే రమణారెడ్డి పాత్రను మొట్టమొదట చూపిన సన్నివేశం చాలామందికి గుర్తుండే ఉంటుంది. పాలమ్మేవాడి పాత్ర. అతడు ఇంట్లోంచి పాలకేన్‌తో బయల్దేరతాడు. కొళాయి ఉన్న చోటుకు వచ్చి నిలబడతాడు. చుట్టూ చూస్తాడు. ఎవరూ గమనించడం లేదని నిర్ధారణకు వచ్చాక గభాలున కొళాయి కింద పాలకేన్ పెట్టి నింపేస్తాడు. అంటే పాలల్లో నీళ్ళు కలిపేవాడనే కాదు. ఆ నీళ్ళు కూడా ఇంట్లోవి వాడితే, అవి తక్కువైపోతాయని కొళాయి నీళ్ళు వాడినవాడన్నమాట. అదీ ఆ పాత్ర తీరు!

"మరి అలాగే సూర్యకాంతం గయ్యాళితనాన్ని ఎస్టాబ్లిష్ చేస్తూ, ఒక సీన్‌రాయాలి కదా?" అని ఆ చిత్ర సంభాషణల రచయిత డివి. నరసరాజుగారు – చక్రపాణి (నిర్మాతలలో ఒకరు– ఆయన రచయితే) గారిని అడిగారు.

"సూర్యకాంతం ఉన్న తర్వాత ఆమె గయ్యాళి కాక ఇంకేం అవుద్ది? వేరే చూపించాలా?" అన్నారు. అదీ ఆమెకు నటిగా ఉన్న బలమైన ముద్ర!

మరో చిత్రంలో భర్తను అదుపులో పెట్టడానికి ప్రయత్నించే భార్య తాయారుగా ఆమె చక్కగా అలంకరించుకుని 'చూసి చూసి కళ్ళుకాయలేకాశాయి' అని సూర్యకాంతం రేలంగిని మెప్పించడానికి పాటపాడే ఘట్టం ఎప్పుడు తలచుకున్నా నవ్వకుండా ఉండలేం! సాధారణంగా హాస్యతారలు గయ్యాళి తారలు ఎక్కువకాలం రాణించడమనేది తక్కువ. 'సీజన్'లాగా కొత్త హాస్యనటుడు రాగానే అంతకు ముందున్న 'తార' క్రమక్రమంగా తెరమరుగైపోవడం జరుగుతుంది. సూర్యకాంతం అలా కాదు. సూర్యకాంతం 1920లో అక్టోబర్ 28న జన్మించారు. చదువుకంటే సినిమా నటన బాగా ఆకర్షించడంతో ఆమె విద్యాభ్యాసం కొనసాగలేదు. మద్రాసు వచ్చి తన అదృష్టాన్ని పరీక్షించుకుందామని జెమినీ స్టూడియోలోని నటనా విభాగంలో చేరారు. నెలకు 75 రూపాయలు. అంటే ముఖ్యపాత్రలు కాని వివిధ భూమికల్లో నటించాలన్నమాట.

తన ధిక్కారస్వరంతో ఎదుటివాళ్ళను కంగారుపెట్టించే పాత్రలకు పేరుపొందిన సూర్యకాంతం కాస్త గుర్తింపుగల భూమికనూ ధరించింది 'ధర్మాంగద' (1949) అనే చిత్రంలో. గమ్మత్తేమిటంటే అది మూగపాత్ర! అందరి దృష్టినీ ఆకర్షించిన పాత్ర ఆమెకు 'సంసారం' (1950)లో లభించింది. ఇక అప్పటినుంచీ ఆమె విజయయాత్ర ప్రారంభమైంది. కోడరికం, చక్రపాణి, దొంగరాముడు, చిరంజీవులు, తోడికోడళ్ళు, అత్తా ఒకింటికోడలే, ఇల్లరికం, దాగుడుమూతలు, రైతు కుటుంబం ఇలా ఎన్నో చిత్రాలున్నాయ్.

'మాయాబజార్'లో ఘటోత్కచుడి తల్లివంటి సాత్వికమైన పాత్రలు కొన్నింటిని సూర్యకాంతం ధ(భ)రించినా, వాటికీ ఆమె సమ న్యాయం కలిగించినా– 'గయ్యాళి' ముద్రమాత్రం ప్రేక్షకుల మనసుల్లోంచి చెరిగిపోలేదు.

అన్నపూర్ణా పిక్చర్స్‌వారు నిర్మించిన దాదాపు అన్ని చిత్రాల్లోను సూర్యకాంతం నటించారు. ఆ సంస్థతో అనుబంధమే కాదు ఆమెకో సెంటిమెంట్ కూడా ఉండేది. ప్రతి జనవరి 1వ తేదీన అన్నపూర్ణా సంస్థ ఆఫీసుకు వచ్చి నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు గారి దగ్గర్నుంచి ఒక వంద రూపాయలు అడిగి తీసుకువెళ్ళేవారు. ఇలాటి నమ్మకాలెన్నో ఆమెకుండేవి. సహనటులను తోబుట్టినవాళ్ళు, తోబుట్టువులుగా చూచే స్వభావం ఉండేది. ఎందరెందరో గయ్యాళి పాత్రలు హాస్యపాత్రలు నటించే నటీమణులు వచ్చారు. కానీ సూర్యకాంతం స్థాయిగల నటీమణులు రాలేదు.

అక్టోబర్ 28 వచ్చేసరికి ఆమె జననాన్నీ, డిసెంబర్ 18 వచ్చేసరికి ఆమె వర్ధంతిని స్మరించుకునేవారున్నారంటే అవి సూర్యకాన్తి లాంటి పాత్రల ప్రభావమే! ●

# జిల్లెలమూడి అమ్మ అనుగ్రహం! శ్రీమన్నారాయణుని గృహనిర్మాణం!

ఏ క్షేత్రమైనా వర్ధిల్లాలంటే సకల వసతీ సౌభాగ్యమైన గృహవసతి తప్పకుండా ఉండాలి! షిర్డీకానీ, పుట్టపర్తి కానీ సకల వసతీ సౌభాగ్యకరమైన గృహనిర్మాణం వెలసిన తరువాతనే క్షేత్రోన్నతిని పొందాయి. **షిర్డీలో బ్యూటీ సాయిమందిరం** నిర్మించిన తరువాత రెండు నివాసవాడలు వెలసాయి. భక్తుల రాక పెరగడంతో ప్రవేటు వసతి గృహాలు మాత్రమే కాదు, స్టార్ హోటల్స్ నిర్మించబడ్డాయ్. ఇంకా నిర్మాణాలు సాగుతూనే ఉన్నాయి. **పుట్టపర్తిలో ప్రశాంతినిలయంలో** నివాసభవనాలు నిర్మించినంతనే ఊరంతా పెద్దపెద్ద హోటల్స్ వెలిసాయ్. రైల్వేస్టేషను, బస్‌డిపో, ఎయిర్‌పోర్టు వచ్చాయి.



జిల్లెలమూడిలో నడయాడిన 'అమ్మ' భారతదేశంలోనే తొలి అమ్మ. ఆ అమ్మ అనసూయాదేవిని రాజరాజేశ్వరీదేవిగా తలచి కొలిచేవారు. ఆ 'అమ్మ' రమణమహర్షివోలె ఉపన్యాసాలు యిచ్చేవారు కాదు. ప్రస్తావన వశాత్తూ వచ్చిన పలుకులనే చరిత్రలుగా వ్రాసారు. గ్రంథాలుగా తీర్చిదిద్దారు. దొరలు వచ్చారు– అమ్మను విజ్ఞాన ఖని – అన్నారు. ఆ అమ్మ ఎందరికో ఉపనయాలు చేసింది. పెళ్ళిల్లు చేసింది. 'అమ్మ' మృదుహస్తాలతో పెళ్ళి చేయించుకొన్నవాడే ఈ శ్రీమన్నారాయణ. 'అమ్మ' భక్తులైన శ్రీ చక్కా శ్రీమన్నారాయణగారు అమ్మ ఆశ్రమ ప్రాంగణ అభిముఖంగా నివాసముండేందుకు సామాన్యభక్తుల కోరికమేరకు సకలసదుపాయకరమైన గృహనిర్మాణమును చేపట్టారు. శ్రీవిద్యానిలయం, శ్రీహైమా నిలయం అనబడే రెండు వసతిగృహ సముదాయాలను ఆశ్రమానికి దగ్గరలో నిర్మించారు. ఎందరో భక్తులు, వాటిని క్రయం చేసో, అద్దెకు తీసుకునో నివసిస్తూ జిల్లెలమూడి క్షేత్రంలో వసతి సౌకర్యం పొందుతున్నారు. తరువాత 'శ్రీనాగేశ్వర నిలయమ'నే వసతి గృహసముదాయాన్ని 'అమ్మ' పతిదేవులైన శ్రీ బ్రహ్మాండం నాగేశ్వరరావుగారి పేరిట మూడవ నిర్మాణం చేస్తున్నారు.

సింగిల్, డబుల్ బెడ్‌రూమ్, ఫ్లాట్లతో, సకల సదుపాయాల సమాహారంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. 'అర్కపురి' మహాక్షేత్రముగా పిలువబడే జిల్లెలమూడి అమ్మ దీర్ఘకాలం నివసించిన సుక్షేత్రం. గుంటూరు జిల్లా బాపట్ల పట్టణమునకు 13 కిలోమీటర్ల దూరంలో బాపట్ల – పెదనందిపాడురోడ్డులో, ఓంకారనది వొడ్డున, సముద్రతీరానికి 8 కి.మీ. దూరాన ఉన్నది. జిల్లెలమూడి చిన్న గ్రామమమైనప్పటికీ ఆరోగ్యకరమైన ప్రశాంత వాతావరణ గ్రామం. అల్లోపతి, హోమియోపతి ఆసుపత్రులతో 24 గంటలు అందుబాటులో ఉండే అంబులెన్స్‌తో, పిల్లల చదువులకై ఏర్పడిన ఒక ఓరియెంటల్ కాలేజీ, హైస్కూలు, వేదపాఠశాలలతో, ఉచిత మినరల్ వాటర్ సదుపాయంతో బాటు S.B.I బ్రాంచితో సామాన్య – వృద్ధ గృహస్థులు హాయిగా సుఖంగా నివసించగలిగే విధంగా పాలకేంద్రము, కిరణా షాపులు మొదలగు సకల సదుపాయాలతో విరాజిల్లుతున్నది.




**ఎక్కడో ఓ విశ్వసనీయుడైన భక్తుడుంటాడు. అలాటి భక్తుల్లోని మేటి భక్తుడు శ్రీమన్నారాయణ. నిరతమూ వచ్చే అమ్మ భక్తులు, నిరంతరమూ అక్కడే ఉండా లనుకునే వద్దాది సత్యనారాయణ వంటి విశ్రాంత భక్తులు ఆవాసములుంటే అక్కడే వుండిపోతారు.**

ఇక్కడ అమ్మ, నాన్నగారు, వారి కుమార్తె హేమ సిద్ధిపొందగా, అనసూయేశ్వర ఆల యం, హైమాలయాలతో పాటుగా నవ నాగేశ్వరాలయం, విఘ్నేశ్వర ఆలయములతో యజ్ఞయాగాదులను నిర్వహించే సుప్రశాంత క్షేత్రం. వచ్చేపోయే భక్తుల కొరకు నిరతమూ వచ్చే భక్తుల కోసం 'అమ్మ' ఆనాడే అన్నపూర్ణాలయం ప్రారంభించింది. అమ్మ వెలిగించిన ఆ పొయ్యి, ఆ గుండిగ– ఈనాటికినీ నిరతాన్న సంతర్పణం చేస్తూండడం ఈ సుక్షేత్ర విశేషం.

జిల్లెలమూడి వంటి ప్రశాంత గ్రామ వాతావరణం గల క్షేత్రము మరొకటి లేదు. నిరంతరమూ యజ్ఞ యాగ, హోమక్రతువులు జరిగే 'అమ్మ' క్షేత్రంలో పరిమిత స్థాయి ఎత్తుల్లోనే పరిమిత పరిధిలో భవనాలు కట్టాలనీ, పట్టణ కాలుష్య వాతావరణం కల్పించవద్దని శ్రీమన్నారాయణగారికి సలహాయిస్తూ, 'అమ్మ' పట్ల విధేయత, కృతజ్ఞతా కల భక్తియుతుణ్ణి ఆశీర్వదిస్తున్నాం; ఆయన విలాసమూ ప్రక్కనే తెలియజేస్తున్నాం:


**శ్రీ చక్కా శ్రీమన్నారాయణ, శ్రీవిద్యానిలయం, జిల్లెలమూడి – 522113,**
**బాపట్ల మండలం, గుంటూరు జిల్లా.** A.P.
**(ఫోను– 08643 – 227300 – Cell 9963385818)**



భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది


అంబికా దర్బార్‌బత్తి

# తిరుధామం... సరస్వతీ మోదం

* సకల సౌకర్యాలు
* విద్యాసంస్థల కొలువు
* పరిశోధనలకు పెద్దపీట
* అంతర్జాతీయ ప్రమాణాలు
* విద్యాప్రాంతంగా గుర్తింపు



ఈనాడు తిరుపతి ప్రపంచపటంలో తిరుధామం. ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగానే కాకుండా సరస్వతీ నిలయంగా ముస్ముందు భాసిల్లనుంది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను ఇక్కడివారికి అందించేందుకు తెదేపా సర్కారు తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న మూడు విద్యాప్రాంతాల్లో ఒకటి తిరుపతి వేదికగా నెలకొల్పాలని నిర్ణయించడం విశేషం. నవ్యాంధ్రలో పదకొండు అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థల ఏర్పాటులో భాగంగా తిరుపతిలో మూడు ప్రధాన విద్యాసంస్థల ఏర్పాటుతో తిరుపతి ముఖచిత్రం పూర్తిగా మారనుంది. ఐఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఐఐఎస్ఈఆర్ ఇక్కడ కొలువుదీరనున్నాయి. ముస్ముందు ఈ దివ్యారామం ప్రఖ్యాత విద్యాకేంద్రంగా సరస్వతీ నిలయంగా మారనుంది. రాష్ట్ర విభజన అనంతర, నవ్యాంధ్రను మూడు నూతన విద్యాప్రాంతాలుగా తెదేపా ప్రభుత్వం విభజించి విశాఖపట్నం, గుంటూరు, కృష్ణా ప్రాంతం సహా తిరుపతిని విద్యారంగాభివృద్ధికి, విద్యాప్రాంతంగా తీర్చిదిద్దనుంది. కేంద్రంతో చర్చించి అత్యున్నతస్థాయి కలిగిన విద్యా సంస్థలను ఇక్కడ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. దీనిలో భాగంగానే తిరుపతిలో ఐఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్‌రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) ఏర్పాటుచేయాలని తలచి సాధ్యాసాధ్యాల పరిశీలన అత్యున్నతస్థాయిలో పూర్తిచేసారు.

## ఏడు విశ్వవిద్యాలయాలకు తోడు...

ప్రస్తుతం ఇక్కడ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర వేదిక్ వర్శిటీ, స్విమ్స్ డీమ్డ్ వర్శిటీ, శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, ద్రవిడ వర్శిటీ ఇలా ఏడు విశ్వవిద్యాలయా లున్నాయి. అయితే ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన విద్యా సంస్థలు రానుండటం నిజంగా ఇక్కడి విద్యావేత్తలకు గర్వకారణమనే చెప్పాలి. ఐఐటీ ఏర్పాటుతో తిరుపతి దశ తిరగనుంది. చాలామంది విద్యార్థులు ఢిల్లీ, ఖరగ్‌పూర్, చెన్నై, ముంబయ్‌లకు వెళ్తున్నారు. ఎన్నో ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నా, నాణ్యమైన విద్య ఏమేరకు అనేదీ అందరికీ తెలిసిందే! ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇక్కడ ఐఐటీ ఏర్పాటుతో ఇంజనీరింగ్ విద్యకు మహర్దశ పట్టనుంది. భావి ఇంజనీర్లకు ఇదో సువర్ణావకాశం. ఉపాధి అవకాశాలు మరింతగా మెరుగు పడతాయి. మెరుగైన ఇంజనీరింగ్ విద్య అందుబాటులో ఉంటుంది.

ఇక కేంద్రీయ విశ్వవిద్యాలయం రాకతో పరిస్థితి పూర్తిగా మారే అవకాశం ఉంది. నేడు ఈ వర్శిటీ కేవలం హైదరాబాద్‌లో మాత్రమే ఉంది. రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం ఉన్నా, అది కేవలం సంస్కృత భాషాభివృద్ధికే పరిమితమైంది. ఇక్కడ ఉన్న పురాతన ఎస్వీయూను కేంద్రీయ విశ్వవిద్యాలయంగా మారుస్తారా? లేక నూతనంగా వర్శిటీని నెలకొల్పుతారా అనే విషయంలో స్పష్టత ఇంకా రాలేదు. దీని ఏర్పాటుతో నూతనకోర్సులు... భవనాలు... యూజీసి నుంచి భారీగా నిధులు... అదనపు పోస్టులు, ఇతరత్రా సౌకర్యాలు... అందుబాటులోకి వస్తాయి. అంతేకాకుండా ఖాళీల భర్తీ పదోన్నతులు... పరిపాలన... తదితర వ్యవహారాల్లో చాలావరకు రాజకీయ జోక్యం నిరోధించే వీలుంటుంది. సమర్థులకు పట్టం కట్టేందుకు... ప్రతిభకు పెద్దపీట వేసేందుకు పరిస్థితి అనుకూలంగా ఉంటుంది., ఇక... సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌కి సంబంధించి వైజ్ఞానిక రంగంలో మెరుగైన పరిశోధనలతోపాటు, విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నాం. **ఏడుకొండలవాడా! చంద్రగిరిలో ఇస్లాము విద్యాలయం రాకుండా చెయ్!**

# తెలుగులో మాట్లాడితే తాట తీస్తా..

ఇప్పటికీ తెలుగుపై పిడుగుపాటు ఎన్నో పర్యాయమో! **రాజధానీ నిర్మాణం కోసం ఆసక్తి చూపే ప్రజలూ, ప్రభుత్వమూ తల్లి భాషా వ్యాప్తికోసం తపనపడదా!**

తెలుగులో మాట్లాడితే తాటతీస్తాననే ఉపాధ్యాయుని/డికి ఎంత ధైర్యం?– పాఠశాలకెంత స్థైర్యం? ధృతరాష్ట్ర దృష్టి వీడండి! మాతృభాషపై అధ్యయనంపై శ్రద్ధ వహించండి! తల్లిపాలు త్రాగుతూ రొమ్ము గుద్దేస్తారా?



ఇంగ్లీష్‌లో మాట్లాడని పాపానికి 42 మంది విద్యార్థులపై వీరంగం చేసిందో టీచర్. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డలోని డాన్‌బాస్కో స్కూల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులను తెలుగులో మాట్లాడారన్న కారణంగా తనూజ అనే టీచర్ చితకబాదింది. విషయం తెలుసుకున్న విద్యార్థుల కుటుంబ సభ్యులు స్కూల్ ఆవరణలో ఆందోళన చేపట్టారు. విద్యార్థులపై దాడిచేసిన టీచర్‌ను సస్పెండ్ చేయాలని, కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థులందరూ ఇంగ్లీష్‌లోనే మాట్లాడే విధంగా చూడాలని ముందుగా అదే తరగతిలోని ఓ విద్యార్థినికి టీచర్ తనూజ చెప్పింది. పిల్లలు ఇంగ్లీష్‌లో మాట్లాడకపోయేసరికి అదే విద్యార్థినిచేత కొందరు విద్యార్థులను కొట్టించింది. అనంతర 42 మంది విద్యార్థులపై ఆమె వీరంగం వేసింది. ముందుగా స్కేల్‌తో విద్యార్థుల చేతులు, వీపు, కాళ్ళపై కందిపోయేలా కొట్టి, తర్వాత పెన్నుతో తమను గుచ్చినట్లు విద్యార్థులు వాపోయారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల కుటుంబ సభ్యులు పాఠశాల చేరుకొని, టీచర్‌ను విధులనుంచి తొలగించాలని ఆందోళన చేపట్టారు. పాఠశాలకు చేరుకున్న పోలీసులతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ ఆవేదనను వెల్లబోసుకున్నారు. కాగా విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టిన టీచర్ తనుజపై చర్యలు తీసుకుంటామని కరస్పాండెంట్ ఫాదర్ జేమ్స్ అన్నారు. ఈ విషయమై బుధవారం స్కూల్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్యలపై నిర్ణయం తీసుకుంటామన్నారు. విద్యార్థులపై దాడులు చేయడం అమానుషమని బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు అనురాగరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు చదవకున్నా, తప్పుచేసినా స్వల్పంగా మందలించాలి కాని ఇలా కొట్టడం సమంజసం కాదని డాన్‌బాస్కో స్కూల్లో 5వ తరగతి చదువుతున్న బోరబండకు చెందిన నవనీత అనే విద్యార్థి తండ్రి దశరథ్ అన్నారు. విద్యార్థులను చితకబాదిన విషయమై ఫిర్యాదు రాలేదని ఎస్.ఆర్. నగర్ సీఐ రమన్‌గౌడ్ తెలిపారు. దాడి విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు మౌకింగా చెప్పారేకాని రాతపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వలేదన్నారు. రాతపూర్వకంగా ఫిర్యాదు లేకపోతే చర్య తీసుకోరు! సంబంధిత ఉపాధ్యాయినిని శిరోముండనం చేయాలి!!

# ఆయన శ్రీరాధా కృష్ణరా(జ)య దేవరాయలు!
# కర్ణాటక తెలుగు విజ్ఞానసమితి స్థాపకాధ్యక్షులు!



శ్రీకృష్ణదేవరాయ పురస్కార గ్రహీతలు డా॥ మోహన్‌బాబు, శ్రీమతి శారద, హంపా నాగరాజయ్య, గోపినాథ్ ఎం.ఎల్.ఏ. (హోసూరు), మంత్రి ఉమాశ్రీ, మంత్రి జయచంద్ర, సమితి అధ్యక్షులు డా॥ ఎ.రాధాకృష్ణరాజు, సమితి ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ.కె.జయచంద్రారెడ్డి

కర్ణాటకలో ఏకైక కన్నడ తెలుగు విజ్ఞాన సాంస్కృతికీ నిలయం ఏదన్నప్పుడు 1952 సం॥ములో స్థాపింపబడిన తెలుగు విజ్ఞాన సమితి. ఆ – జ్ఞాన – అజ్ఞాన సంపన్నులకు కూడా అది విజ్ఞాన సాహితీ సాంస్కృతిక నిలయం. బెంగుళూరు వెళ్ళే ఏ తెలుగు కళా సాంస్కృతీపరుడైనా చిరునామా సంపాదించాలంటే రాధాకృష్ణ రా(జు)యలు కేరాఫ్ చెప్పుకోవాల్సిందే! ఆయన రెండు చేతులూ ఒకటి 'తెలుగు'నీ మరొకటి కన్నడాన్నీ కరతలామలకం చేసుకున్నాయ్. కన్నడ కంఠీరవుడైన రాజ్ కుమార్‌కీయన కంఠాభరణం. పార్థుడు రెండు చేతులా బాణములను సంధించి 'సవ్యసాచి' అనిపించుకున్నట్లు ఈయన్ను సవ్యసాచి యన్నా పొరబాటు కాదు. నవ్యాంధ్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు రెప్పపాటుల్లో కూడా ఈయన ఉంటారు. ఉపోద్ఘాతం వదలి అసలు విషయానికొస్తున్నాను. ఏటేటా (గత ఏడు నేనెరుగను) కళా, సాహిత్య సాంస్కృతి రంగాలకిచ్చే– శ్రీకృష్ణ దేవరాయల పురస్కారాలను– ఈయేడు డా॥ మోహన్‌బాబు, ఊర్వశి శారద, హంపా నాగరాజయ్య, హోసూరు M.L.A. గోపీనాధుడు మంత్రిణి ఉమాశ్రీ, జయచంద్రలకు ప్రదానం చేసినట్లు యీ చిత్రమే సాక్షీభూతం. విజయోస్తు రాధాకృష్ణ రా(జు)యా– విజయోస్తు ఏ. కె. జయచంద్రారెడ్డి వరేణ్యా!

**ఇన్ని కోట్లు పెట్టి రాజధాని కట్టడం అవసరమా?**
**చక్కని పంటపొలాలకు చిచ్చుపెట్టి - అంతస్థులకంత స్థులభవనాలు నిర్మించడం అవసరమా!**
**తర్వాత తర్వాత తిండిలేక పస్తులా?**

**రాజధాని అనేది ఒకేసారి నిర్మింబడేది కాదు.**
**ఏముందని కర్నూలు వెళ్ళాం?**

**రాజధాని నిర్మాణానికి విరాళాలా?**
**హుండీలా!**
**భాషా సంస్కృతులను నెమరేయరా?**


*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels.yahoo.co.in, Grams : "MAYURA"**

శ్రీ.వి. రావ్ పేజీ
(గోటేటి వేంకటేశ్వరరావు)

**పట్టు వదలకుండా చేసే ప్రయత్నం చివరకు విజయాన్ని చేకూరుస్తుంది. ఒక్క రోజులో దేన్ని సాధించలేం.**
- స్వామి వివేకానంద



## ఇది మన భారతం

మూడేళ్ళ పిల్లను, ఆరేళ్ళ పిల్లను బలాత్కారం చెయ్యడం, నాలుగు రోజులు గొడవ, రెండు రోజులు క్రొవ్వొత్తుల ప్రదర్శన, పదిసార్లు టీవీలలో రావడం, మళ్ళీ కొత్త సమస్య, వీటికి అంతేమిటి, సమాజంలో ఉన్నత వ్యక్తులు కౌరవ సభలో పెద్దలలా మౌనం వహిస్తున్నారు. మొన్న చెన్నైలో 82 ఏళ్ళ పెద్దావిడను 21 ఏళ్ళ కుర్రాడు బలాత్కరించి ఆవిడ వంటి మీద నగలు ఎత్తుకుపోయాడు, ఇలాంటి మృగాలను తిరగనివ్వచ్చా? ఆఖరికి పిచ్చి కుక్కలు నలుగురిని కరిస్తే దాన్ని మందు పెట్టి చంపేస్తారు. వీరికి అలాంటి శిక్షే పడాలి. మొన్న ఒక పెద్దాయనను ఆయన కొడుకు తీసుకొచ్చి చెన్నై బస్‌స్టాండ్‌లో ఇక్కడే చావు, ఇంటికి రాకు అంటూ విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. ఆయనకు ఆరుగురు సంతానం, ఐదుగురు అమ్మాయిలు, ఒక కొడుకు, పైగా ఆ కొడుకు పురోహితుడు, అలాంటి వాడు పూజలు చేస్తే ఫలితాన్నిస్తాయా? ఇలాంటి "......" కొడుకులు వున్నా ఒక్కటే, లేకపోయినా ఒక్కటే. మన సంస్కృతి, సంప్రదాయం, మర్యాద, గౌరవం, ప్రతిష్ఠా ఇవన్నీ ఏమై పోయాయి. పాశ్చాత్య వ్యామోహంలో పడి అన్నిటికి తిలోదకాలిచ్చే సామా? నేను, నా పెళ్లాం, నా పిల్లలు, నా ఇల్లు, నా సంపాదన ఎప్పుడొచ్చాయో అప్పుడే మన లోని మానవత్వం చచ్చిపోయింది, ఇలాంటి విషయాలను చూచి స్పందించనందువల్ల మనిషి చచ్చిపోయాడు.

* * *

ఇది వానాకాలం మచ్చుకి ఒక్క చుక్క కూడా ఇంతవరకూ పడలేదు. కనీసం చెంచాడు లేదా గరిటెడు లేదా చెంబుడు వాన నీళ్ళు కూడా పడలేదు. ఎలా? అనుకుంటుంటే నాకీ వానాకాలం కవిత కనపడింది. అత్యద్భుతంగా వుంది శ్రీకృష్ణదేవరాయలు "ఆముక్తమాల్యద"లోని వర్ణన తెలుగు భాషా మాధుర్యాన్ని నేను అనుభవిస్తూ మీకు పంచుతున్నా... ఈ కవిత్వాన్ని ఆస్వాదిస్తూ సంతోషపడనా లేక వాన లేదని బాధపడనా? మీరే చెప్పండి –

రాజ్యాభిషేకం తర్వాత యమునాచార్యునికి అస్త్రశస్త్ర విద్యలు, రాజనీతి, స్వయంగా నేర్పించి, దివ్యాస్త్ర మంత్రాలు కూడా ఉపదేశించాడు పాండ్యరాజు. రాజు అయినవాడు తరచూ శత్రువులపై దండెత్తి జయించి రావాలని హెచ్చరించాడు. కాని వస్తున్నది వర్షాకాలం. వర్షాకాలంలో దండయాత్ర చేయుట తగదని మంత్రి, పురోహితులు వారించారు. ఆ వర్షాకాలాన్ని అద్భుతమైన పద్యాలలో రాయలవారు ఈవిధంగా వర్ణిస్తున్నాడు.

**మ. తనతోయం బినరశ్మ లెత్త, నిల వాత్యారేణుమూర్తిన్ మహేం**
**ద్రునకుం జెప్పగ, ద్రుచ్చుఁ బట్ట దివమందు న్విల్లటింపం, భయం**
**బునఁదద్రశ్మిసహస్రము న్వెస డిగెం బో డాఁగి వే గ్రుమ్మరిం**
**ప, ననం ధారలు దోఁచె మించు వెలిఁగింప న్మబ్బుల న్వెల్లిపై**

వానాకాలంలోని గాలివానని చిత్రిస్తున్న పద్యమిది. ఆకాశంలో ఓవైపు దట్టని మేఘాలు, మెఱుపులు, మరోవైపు ఇంద్రధనుస్సు, దుమ్ము రేపే జోరుగాలి. హోరువాన. ఇవన్నీ ఉన్నా యీ పద్యంలో. వీటన్నిటినీ కలిపి ఒక అందమైన కథ అల్లాడు కవి. భూమి, తనలోని ఉదకాన్ని (నీటిని) సూర్యకిరణాలు ఎత్తుకుపోయా యని, సుడిగాలి రేణువుల రూపంలో వెళ్ళి దేవేంద్రుడితో మొఱ పెట్టుకుందిట. వెంటనే ఆ ఇంద్రుడు విల్లంబులు ధరించి ఆకాశంలో దొంగను పట్టుకోవడానికి బయలుదేరాడు. మబ్బుల చాటున మెఱుపుల రూపంలో దాగిన ఆ కిరణాలది గమనించి, తాము దొంగలించిన నీటినంతా తొందరగా పారేయాలనే ఆత్రుతతో గ్రుమ్మరించేస్తున్నట్టుగా వర్షం కుండపోతగా కురుస్తోందట!

ఈ వర్ణనలో రాయలవారి రాజధర్మ నిర్వహణ తొంగిచూడటం లేదూ! ఇందులో మరొక విశేషం కనిపిస్తుంది. సూర్యుని వేడిమికి భూమ్మీద నీరు ఆవిరై మేఘాలు ఏర్పడి వానలు కురిసే జలచక్రం గురించిన అవగాహన, కనీసం రాయలనాటి కాలానికి మన దేశంలో ఉందని తెలుస్తుంది. ఆ శాస్త్ర పరిజ్ఞానాన్ని అందమైన కథ రూపంలో చెప్పడమూ కనిపిస్తుంది.

**సీ. ఎలగోలుజల్లు మున్ పెళపెళ నేటవా**
**ల్పడి గాలి నట్టిండ్లఁ దడిపి చనఁగ**
**నట్టితో వడగండ్ల కట్టావుల దుమార**
**మావుల రేఁచి రెండవదియుఁ జన**
**మఱి మూఁడవది నిల్చి మెఱసి బిట్టుఱిమి శీ**
**కరవారి సృష్టిఁజీకటిగ నలమ**
**నుయ్యేలచేరుల యోజఁ బై పై వెండి**
**జల్లుపై జల్లు పెల్లల్లుకొనఁగ**
**తే. భూభిదాపాది దుర్భరాంభోభరంపు**
**పడి మరుజ్ఝంఝం దెరలక కడవ వంచి**
**నట్లు హోరని దారౌఘ మైక్య మొంది**
**విన్ను మన్నును నొకటిగా వృష్టి బలసి**

ఈ పద్యంలో అంచెలంచెలుగా కురిసే వానని స్వభావోక్తిలో వర్ణిస్తున్నారు రాయలవారు. మొదటి జల్లు పెళపెళ ధ్వనితో ఏటవాలుగా వచ్చి గాలితో కలిసి గుమ్మాలు దాటి నట్టింట్లోకి దూరి తడిపేసే వెళుతుంది. వెంటనే రెండవ జల్లు వడగళ్ళతో వచ్చి భూమిని తడిపి, వేడిపొగలూ, దుమ్మూ రేపి వెళ్ళిపోతుంది. ఆ వెనకే మూడవ జల్లు వచ్చి కొంతసేపు ఆగి ఉరుములు మెరుపులతో, చిరు తుంపరలతో అంతా చీకటి చేస్తుంది. ఇక ఆతర్వాత జల్లు మీద జల్లు ఉయ్యాల గొలుసుల్లా పెనవేసుకుపోయి కురవడం మొదలుపెడతాయి. కారు మబ్బులు కమ్మి, జోరుగాలితో కూడి, భరింపలేని వేగంతో, భూమి ఆకాశాలు ఏకమైనట్టుగా హోరుమనే ధ్వని చేస్తూ, కడవతో నీరు గ్రుమ్మరించినట్లు విడువకుండా కురుస్తుంది వాన.

**చం. పెళపెళ మబ్బు బిట్టుఱుమ భీతి విదూరశిలాంకుర చ్ఛటో**
**త్పులకినియై ప్రియు న్ని దురవోవు హరి న్వడిఁ గౌఁగిలింపఁగాఁ,**
**దలరి ధరిత్రి సాఁచు గఱు దాల్చిన గేళ్ళన గంకణంపుమ్రోఁ**
**తలఁబులు ఏల పందు పయిఁదాల్చి నదు ల్వెసఁ జొచ్చెవారిధిన్.**

పెళపెళమని మబ్బురిమింది. ఏకాంతంలో కాంత భూదేవికి భయం కలిగింది. పక్కనే ఉన్న భర్త గాఢంగా నిద్రిస్తున్నాడు. (వానాకాలంలో నాలుగు నెలల పాటు విష్ణుమూర్తి నిద్రలోకి వెళతాడని అంటారు కదా!). భయం పోగొట్టుకోడానికి భర్తపై చేయి చాచినట్లు నదులు దీర్ఘంగా సాగాయి. నదిలో కొత్త నీరు కదా, గడ్డి తేలుతోంది. అవి భూదేవి పొందిన గగుర్పాటుకి గుర్తుల్లాగా ఉన్నాయి. శరీరమ్మీద పులకలన్న మాట. ఆ నదిలో నీటిపక్షులు కిలకిలమంటున్నాయి. అవి, ఆ నదులనే చేతులకి ధరించిన గాజుల గలగలల్లాగ ఉన్నాయి. వానాకాలంలో బురద కూడా ఉంటుంది కదా. అది భూదేవి తాల్చిన గంధపుపూతలాగా ఉందట! అలా, ఆ వర్షాకాలపు నదులు సముద్రంలో సంగమించడం, భీతిల్లిన భూకాంత తన ప్రియుని కౌగలించుకున్నట్టుగా ఉన్నదని కవి ఊహ. ఇక్కడ మళ్ళీ మనం గుర్తుకు తెచ్చుకోవలసిన విషయం – ఈ కావ్యంలో ప్రధాన రసం, శృంగారం. పైగా కావ్యనాయిక అయిన గోదాదేవి భూదేవి అవతారం. అంచేత అక్కడక్కడా యిలాంటి వర్ణనలు ఆ రసస్ఫురణను కలిగిస్తాయి. ఇలా మొత్తం అరవై పద్యాలలో వర్షాకాల వర్ణన చేసారు కృష్ణదేవరాయలు. మచ్చుకి రెండు పద్యాలు మాత్రం ఇక్కడ వివరించడం జరిగింది. ఆ వర్ణనలో శాస్త్ర విషయాలు, సమాజ జీవితం, అద్భుత కల్పనలు, స్వభావోక్తి – అన్నీ కనిపిస్తాయి.

**(కామేశ్వరరావు భైరవభట్ల, జ్యోతి వల్లభోజు, ఆముక్తమాల్యద బ్లాగ్ స్పాట్ ఆధారంగా)**